# వాటాల యిల్లు

**మా వీథికి దగ్గరగా ఒక కాలేజీ వుంది. ఆ కాలేజి నుంచి బయలుదేరి మా వీథికొచ్చి కుడివైపు తిరిగితే మూడవ యిల్లే మాది. "మాది" అంటే నిజంగా మాదే అనుకోగలరు!**

మేము అద్దెకుంటున్నది. మా యింటావిడది!

మా యింటావిడ అంటే ఫారిన్ రిటర్న్డ్!

విమెన్స్ కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపాల్!

ఆవిడ యిల్లు ఒక బంగళా లాంటిది. చక్కటి గేటు! దానికి, ఆ గేటు పట్టి చూస్తేగాని కనబడనంత దట్టంగా బోగన్‌విల్లా తీగలు విరగబడివుంటాయి! అవే నేమిటి? నాకు వాటిల్లో కొన్ని పేర్లు తెలీవుకాని, ముద్దమందారం, మాలతి, జాజి, మల్లి, సంపెంగ, నందివర్ధన... యింకా యింకా ఎన్నో వున్నాయి. క్రోటన్స్ మొక్కలు లెక్కలేనన్ని! అయితే అంత అందమైన గేటులోంచి యింటిలోకి వెళ్ళే భాగ్యం మాత్రం మాకు లేదు. మాకే కాదు, ఆ యింట్లో అద్దెకుండే మా లాంటి వాళ్ళు మరో అయిదారు కుటుంబాలకి అలాంటి అవకాశంగానీ, అదృష్టంగాని, ఏర్పాటుగానీ లేదు. మా అందరికోసం యింటికి (సారీ! బంగళాకి) కుడివైపు నున్న చిన్న సందులో ఒక చిన్న విరిగిపోతున్న గేటు పెట్టించి, పెద్ద వుపకారం చేసిందానిలా పోజుపెడ్తుంది. ఆ గేటు క్కూడా రాత్రి పదయ్యేసరికి తాళం!

రాత్రి పది దాటేక మావారు యింటి కొచ్చేరంటే యింతే సంగతులు! అరగంట జపం చేస్తే గాని రాదు. ఈలోగా ఆవిడ పెంచుతున్న రెండు కుక్కలు ఎవరో దొంగలు పడినంత గట్టిగా అరచి మా ప్రాణం తీయాలి! వాటిని అదిలించి, బుజ్జగించి, ప్రాణాలు బిగపెట్టుకుని, యింటావిడ పెరటివైపున్న తలుపుకొట్టి తాళం తీయమని చెప్పాలి. ఆవిడ పడగ్గదిలో పరుపుమీద తలగడ క్రింద దాచుకున్న తాళం చేత్తో పట్టుకుని, పట్టుపరుపుమీంచి లేచి, ఆ కుక్కల్ని ముద్దుగా కసిరి, మెల్లగా నడచివచ్చి తాళం తీసి... ఈ తతంగమంతా పూర్తయ్యేసరికి, దగ్గరదగ్గర పదకొండయిపోతుంది!

అదేదో పెద్ద రాత్రయిపోయినట్టు, యింగ్లీషులో సారీలు, ఎక్స్‌ప్లనేషన్లు!

"ఏమిటీ బాధ?" అని నేను కసురుకుంటే, ఏదో ఒక యిబ్బంది ప్రతి యింట్లోనూ వుంటుంది. ఎడ్జెస్ట్ అవ్వాలి మరి" అంటారు మావారు.

ఇది ఒక్కటే కాదు. ఇలాంటి సవాలక్ష యిబ్బందులు వున్నాయి.

మా యింట్లోకి (అదే మా పోర్షనులోకి) వెళ్తూంటే తోవలో మా ముఖాలకి తగుల్తూ (ముళ్ళు గుచ్చుకుంటూ) లెక్కలేనన్ని గులాబీ మొక్కలు, అందమైన గులాబులు! నేను, నన్నూ - నా పిల్లల్ని కంట్రోలు చేసుకోగలను. కాని యింటికొచ్చేవాళ్లకి బోధపరిచేసరికి తల ప్రాణం తోక్కి వచ్చేది! అలా విరగబూస్తున్న గులాబులన్నీ చూసి ఆనందించడానికేగాని, ముట్టుకునే అర్హత

లేదని చెప్తే ఆశ్చర్యపోయేవారు!

గులాబిని కోసినా, కొయ్యకపోయినా ఎన్నాళ్ళుంటుంది? కాని తను పెట్టుకోదు. ఎవర్నీ ముట్టకోనివ్వదు.

మేడమీద రెండు పోర్షన్లు. ఒక పోర్షనులో బ్యాంకులో పనిచేస్తున్న రెడ్డి వుంటున్నాడు. బాచిలర్! మావారికి స్నేహితుడు. ఎప్పుడూ మా యింట్లోనే వుండి ఏదో ఒక బాతాఖానీ చేస్తూ వుంటాడు. మహాపెంకివాడు, మొండి వాడు. రెండవ పోర్షనులో ఒక బెంగాలీ అమ్మాయి. విమెన్సు కాలేజిలో లెక్చరర్. చాలా స్ట్రిక్ట్‌గా వుంటుంది. మగవాళ్ళని మైలు దూరంలో నించోపెట్టి మాట్లాడుతుంది. వయసు నలభై పైనే వుంటుంది. కాని పెళ్ళి కాలేదు. వృద్ధ కన్య!

ఇహ కింద పోర్షన్లు అన్నిటిలోకీ పెద్ద పోర్షను మాది. మా వెనకవైపు ఒక బెంగాలీ కుటుంబం, ఎదుటి పోర్షనులో ఒక ఒరియా అమ్మాయి అద్దెకుంటున్నారు. ఇహ అటువైపు ఒక మలయాళ ఫ్యామిలీ వుంటున్నది. అన్నింటికంటె చివరకి చిన్న గది. ఆ గదిలో మా అందరికీ పనిచేసే పనిమనిషి కుటుంబం వుంటున్నది. మా యింటావిడకి అది అద్దె యివ్వదు. ఆవిడ దానికి జీతం యివ్వదు. ఆ గది అద్దె పది రూపాయలనుకోవచ్చు. కాని ఆవిడ మాత్రం ఏభయి రూపాయల పని చేయించు కుంటుంది. రాత్రి - పగలు అనే తేడా లేకుండా ఆవిడ ఏ సమయంలో పిల్చినా 'ఆ' అంటూ వెంటనే పలకాలి! స్విచ్‌వేస్తే లైటు వెలిగినట్టు! లేకపోతే దాన్ని యింట్లోంచి వెళ్లిపొమ్మంటుంది. పాపం దాని పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా వుంటుంది. దాని సంగతనేమిటి. ఆ యింట్లో అద్దెకుంటున్న అన్ని కుటుంబాలు యించు మించు అదే స్థితిలో వున్నట్టే!

డాక్టర్ రౌండ్సుకి వెళ్ళివచ్చినట్టు, ఆవిడ గంటకోసారి యిల్లంతా ఈ చివరనించి ఆ చివరదాకా తిరిగి, గోడలు, గచ్చులు, మొక్కలు, గేటు, కాలవలు అన్నీ సరిగ్గా వున్నాయో లేదో చూసివస్తుంది! కామన్ గేటు మీద కాళ్ళు పెట్టి పొరపాటున పిల్లలెవరైనా ఊగితే దానికి కన్నవాళ్ళదే బాధ్యత! ఆమాత్రం పిల్లల్ని మెండ్ చెయ్యకపోతే ఎలాగ? అని తనకి తెల్సిన భాషలన్నిటిలోనూ లెక్చర్ దంచుతుంది. అలాగని చిరాకువేసి నేను పిల్లల్ని కొడితే "అలా పిల్లల్ని కొట్టకూడదు. పిల్లలు దైవ స్వరూపాలు" అంటూ అరగంట సేపు యింగ్లీషులో ఉపన్యాసం యిచ్చి మరీ వెళ్తుంది.

రెడ్డి దిగుతానని చెప్పినప్పుడే నేను వున్నసంగతి చెప్పి, ఆవిడ పదిగంటలకి గేటు తాళం వేస్తుందని, "మరేం ఫర్వాలేదు. ఇంద్రుడూ - చంద్రుడూ నేనంటే దడుస్తారు. ఈవిడో లెక్కా! అన్నాడు. ఎప్పుడైనా పది దాటితే చక్కగా గోడదూకి వచ్చేసేవాడు. అదేం చిత్రమో! ఆ కుక్కలుకూడా అలాంటప్పుడు చూస్తూ వూరుకునేవి! వాటిని రోజూ దువ్వి, బిస్కట్లు పెట్టి మంచిచేసు కున్నాడని తర్వాత తెల్సింది.

రెడ్డి, మావారూ చాలు నన్ను అల్లరి పెట్టడానికి! మా పిల్లలు ముగ్గురూ కాన్వెంటు చదువులు చదువుతున్నారు. వాళ్లకి పాఠాలు చెప్పుకోవాలి. ఇవతల వండుకోవాలి. వాళ్ళ జోకులు, విసుర్లు, చలోక్తులు, విమర్శలు, నిందలు (ఆడవాళ్ళ మీద జనరల్‌గా) యివన్నీ విని భరించాలి!

ఒకరోజు ఉదయం అతనింకా మేడ దిగిరాలేదు. మావారే వెళ్ళారు మేడమీదకి. మరో అయిదు నిముషాల్లో యిద్దరూ దిగివచ్చేరు. రెడ్డి చేతిలో కాగితాలతో చుట్టిన పొడుగు సీసా వుంది.

"ఏమండీ మూర్తిగారూ! ఓపెన్ చెయ్యమన్నారేమిటి?" నవ్వుతూ అడిగేడు.

"చెయ్యండి" నావైపు క్రీగంట చేసి నవ్వుతూ అన్నారు మావారు.

నాకు అనుమానంగా వుంది. "ఈ రెడ్డి అల్లరి యింతా అంతా కాదు. ఇవాళేం చెయ్యడానికి వచ్చేడో?" అని.

"అమ్మో! ఇది యిలా ఓపెన్ చేస్తే ఎలాగండీ? ముందు మీ ఆవిడ్ని చిప్స్.... అవీ వేయించి తెమ్మనండి".

నాకు భయం లేసింది. ఏమిటీ మనిషి? తా చెడ్డ కోతి వనమెల్ల చెరచిందన్నట్టు" ఎప్పుడో మిలటరీలో వున్నప్పుడు డ్రింక్ పుచ్చుకునే వాడట. ఇప్పుడు డైరెక్ట్‌గా ఇక్కడికే తెచ్చేశాడు. కొత్త సీసా కాబోలు. ఏం దారి భగవంతుడా!- అనుకున్నాను మనసులో. అతను మాత్రం చిద్విలాసంగా నవ్వుతూ కూర్చున్నాడు. అతనివైపు చూసేను. తొందరపడ్డం ఎందుకని చూస్తూ వూరుకున్నాను. నేనలా వూరుకోవడం చూసి రెడ్డి మరింత ఆశ్చర్యపోయేడు.

"బ్రాందీ తాగుతున్నా మీ ఆవిడ ఏమీ అనరేమిటండీ? మీకు గ్రీన్‌సిగ్నల్ యిచ్చేసేరేమిటి?" అన్నాడు నవ్వుతూ.

"నేనేం చేసినా మాఆవిడ ఏమీ అనదులెండి" అన్నారు మావారు నావైపు కొంటెగా చూసి నవ్వుతూ.

నాకు వీళ్ళిద్దరి వ్యవహారం అంతు పట్టకుండా వుంది.

ఇంతలో కల్పన వచ్చింది "దీదీ" అంటూ. కల్పన యింటావిడ కూతురు. ఆవిడ పంచప్రాణాలూ దానిమీదే.

ఆవిడకి ముందూ వెనకా ఎవ్వరూ లేరు. ఈ మహాత్ముడు ఆవిడని 'కేమిల్ కేట్ కమ్ బెనారస్' అన్నాడు. 'ఒంటి-పిల్లి-రా-కాశీ'కి ఇంగ్లీషు మాటల కూర్పు అది. ఆవిడ తర్వాత ఆస్తంతా కల్పనదే. కల్పన చలాకైన పిల్ల. బి. ఎస్‌సి ఫైనల్ చదువుతోంది. వంకాయ మసాలకూర అంటే పడిఛస్తుంది... ఆరోజు చేస్తానని ముందే చెప్పాను. ఏ రోజు చేసినా విధిగా దానివంతు దానికివ్వాల్సిందే.

అదికాక నేను కొన్నాళ్ళయి గమనిస్తున్నది ఇంకొకటుంది:

రెడ్డి వచ్చిన టైముకే ఏదో మిష పెట్టుకుని వస్తోంది, ఈ కల్పన. "ఇదేదో అనుమా నించదగిన విషయంలాగే ఉంది" అనుకున్నాను. మొత్తానికి కోటలో పాగావేస్తున్నాడు రెడ్డి. రొట్టె విరిగి నేతిలో పడుతుందిగాబోలు. "ది గ్రేట్" యింటావిడ కూతుర్ని ప్రేమించేస్తున్నాడంటే అంతకంటే గ్రేట్ అన్నమాట రెడ్డి!

రెడ్డి దానివైపు ఓరచూపులు చూడ్డం, అది రెడ్డివైపు వాలుచూపులు చూడ్డం, నేను కనిపెడ్తూనే వున్నాను.

రెండు మూడు హిందీ పిక్చర్సుకు వాళ్ళిద్దరూ విడివిడిగానే వెళ్ళినా హాల్లోమాత్రం పక్కపక్కనే కూర్చున్నారని, బీచీలో అప్పుడప్పుడూ దగ్గరగా కూర్చుంటున్నారని చిన్నచిన్న వార్తలు కూడా సేకరించేను.

కల్పన కూడా సీసావైపు, రెడ్డివైపు: మార్చిమార్చి చూస్తోంది.

ఈ వ్యవహారం ఆ అమ్మాయికి అంతు పట్టలేదు కాబోలు!

తర్వాత కొంతసేపుండి కల్పన వెళ్ళి పోయింది. కల్పన వెళ్ళేక అడిగేను.

"మీరు ఆ అమ్మాయిని ప్రేమిం చేస్తున్నారేమిటి కొంపతీసి?"

నా ప్రశ్నలకి అల్లరిగా నవ్వేడు రెడ్డి.

"ఆహా! చూస్తూ వుండండి. ఆ యింటావిడకి అల్లుడ్ని అయి తీరుతాను." అన్నాడు గర్వంగా ఫోజు పెట్టి.

అబ్బ! ఏం మగాడివయ్యా! యింటావిడ అల్లుడవడం అన్నది ఏదో పెద్ద క్వాలిఫికేషన్ అన్నట్టు మాట్లాడతావు?! ఆ అమ్మాయికి మొగుడవడం కంటె యింటావిడకి అల్లుడిగానే ఎక్కువ గుర్తింపు వుంటుందనా?" అన్నాను నవ్వుతూ.

ఆ మాటకి అతను బిగ్గరగా నవ్వేసేడు.

"ఇంతకీ, మన సీసా సంగతి తేల్చేరు కాదు. మూర్తిగారూ. ఏం చేద్దాం?'

నా వైపు తిరిగి అన్నాడు. "ఓ సీసా కప్పులు రెండు తెండి. పోనీ చిప్స్ అవీ వేయించొద్దు లెండి. మీ కెందుకు అనవసర శ్రమ. ఇలా "రా"గా తాగేస్తాంలెండి". అని నవ్వుతూ సీసా మూత తీసేడు. అది యిట్టే వూడి వచ్చింది. అది కొత్త సీసా మూతలా లేదు! నాకు కొంత ధైర్యం వచ్చింది. లోపలికి వెళ్లి చిన్న గ్లాసు తీసుకొచ్చేను.

ఈ గ్లాసులో కొంచెం పొయ్యండి మీ బ్రాందీని. మా వాడి కిస్తాను. తాగి చూస్తాడు. నా కిది మంచినీళ్ళేమో అని అనుమానంగా వుంది." అన్నాను నవ్వుతూ.

"భలేవారే! అసలు సిసలైన బ్రాందీ మంచినీళ్లలాగే కనబడ్తుంది. పోనీ యివ్వండి. మాకేం పోయింది!! కాని ఆ తర్వాత మీరే విచారిస్తారు." అన్నాడు జాలిగా ముఖం పెట్టి.

"ఫర్వాలేదు. అదంతా నేను చూసుకుంటాను. యివ్వండి." అన్నాను మొండిగా. విధిలేక యిచ్చేడు. మా వాడు తాగి, చూసేసి -

"అమ్మా! మంచినీళ్లే!" అన్నాడు వాడు.

అందరం నవ్వుకున్నాం.

ఇంటావిడ రౌండ్సుకి తిరిగేవేళ అది!

అందర్నీ లైన్‌లో నించో పెట్టి తిడుతుందేమోనని భయం వేసింది. కాని అలాంటి దేమీ జరగలేదు. థాంక్‌గాడ్!

"చూసేరా? ఇప్పుడు మీ తలనొప్పి తగ్గి పోయిందా?" అన్నాడు హఠాత్తుగా.

ముందు ఆశ్చర్యపోయి తర్వాత నవ్వేసేను. నాకు రోజూ తలనొప్పి. ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదు. ఎవరితో నైనా సరదాగా మాట్లాడుతూంటే మాత్రం తాత్కాలికంగా తల నొప్పి సంగతి మర్చిపోతూ వుంటాను.

★ ★ ★

మరొక రోజు... సాయంత్రం ఆరయింది. పిల్లలు ఆడుకుందికి వెళ్లేరు. నేను లోపల వున్నాను.

మా వారు, రెడ్డి, మరో యిద్దరు, ఒక బాబాజీ లోపలికి వచ్చేరు.

రెడ్డి మాటలు వినిపించేయి వినయంగా.

"ప్లీజ్, టేక్ యువర్ సీట్!"

"యస్. థాంక్యూ."

మా వారు కూడా అతి వినయంగా ఆ బాబాజీకి ఎదురుగా నిల్చున్నారు. బాబాజీ వైపు చూసేను లోపల్నుంచే.

తెల్లటి దొరల తెలుపు!

నల్లటి గెడ్డం!

కాషాయ రంగు లాల్చీ. కాషాయరంగు నిక్కరు లాంటిదేదో!? నిశితంగా చూడాలంటే ఇబ్బంది అనిపించింది.

నన్ను పిల్చి పరిచయం చేసేరు ఆయన; ఇంగ్లీషులో నా వైపు తిరిగి అన్నారు. "నమస్కారం చెయ్యి. అతను చాలా పెద్ద రుషి"... ఏదో తక్షణ భక్తి లాంటిది కలిగి, నమస్కారం చేసేను.

రెడ్డి మొదలు పెట్టేడు. "ఇతను ఎవరను కున్నారు?!! హృషీకేశ్ నుంచి వస్తున్నారు. శ్రీశ్రీశ్రీ చిదానందస్వాముల వారు!! ఇతనికి అన్ని భాషలూ వచ్చు, తెలుగు తప్ప!! చిన్నప్పుడే జీవితం మీద, ఐహిక సుఖాల మీద విరక్తి కలిగి సన్యాసం పుచ్చుకుని హృషికేశ్‌లో వుండి పోయేరు! అయితే యితను నాకెలా తెల్సు? అని అడగ్గలరు. ఇతని పర్సనల్ సెక్రటరీ.... ఇదుగో?... మిస్టర్ వేణు... అని యితను చిన్నప్పుడు నా క్లాసుమేట్. నేనూ, మూర్తిగారూ అలా వెళ్తూంటే, బీచ్ దగ్గర అనుకోకుండా వీళ్ళు కనబడ్డారు. ఎంతో బతిమాలగా ఇక్కడికి వచ్చేరు. ఇవాళ యితను రావడం... నిజంగా మీ యిల్లు పావనమైంది అనుకోండి! మీరు చాలా అదృష్టవంతులు కాబట్టే అంతటి మహానుభావుడు మీ యింటికి స్వయంగా విచ్చేసేడు! అన్నట్టు మీకు రోజూ తలనొప్పి అంటున్నారు కదా! అడగండి. ఇతని దగ్గర విభూతి వుంది. తగ్గుతుందేమో."

ఇదంతా విని, ఊదిన బెలూన్‌లాగా నా మనసు పొంగి పోయింది!

నా ఆనందాన్ని, సంతోషాన్ని, అదృష్టాన్ని వర్ణించడానికి నాకున్న భాషా పరిజ్ఞానం చాలదు. అంత సంతోషాన్ని పట్టలేకపోయేను. నిజంగా రెడ్డి అన్నట్టు అంతటి మహానుభావుడు తనకు తానుగా మా యింటికి రావడం, మేము ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో!! లేకపోతే అలాంటి వాళ్ల దర్శనం కోసం బోలెడు రైలు ఖర్చులు పోసుకుని ఎంత మంది వెళ్లడం లేదు!

ఆహా! ఆ ముఖంలో ఎంత వర్చస్సు!

ఎంత ప్రశాంతత!

గబగబా లోపలికి వెళ్లేను, అంత మందికీ కాఫీలు కలిపి యివ్వడానికి. స్టౌమీద కాఫీకి నీళ్ల పెట్టి పెరటి వైపు తలుపు తీసుకుని అప్పటికే యీ వారనుంచి ఆ వార నుంచి తొంగి తొంగి

చూస్తున్న మిగతా వాళ్ల వాళ్లకి చెప్పేను. బాబాజీగారి దర్శనం చేసుకోవాలని ఎవరి కుండదు? బెంగాల్ అతను (మల్లిక్) తన పిల్లల్ని తీసుకుని వచ్చేసి అతి వినయంగా బాబాజీ కాళ్లమీద పడి, పిల్లల్ని కూడా సాష్టాంగపడమని చెప్పి, దీవించమన్నాడు. చిదానందస్వామి అలాగే చేసేరు.

"ఠాకుల్ హైం, ఠాకుల్. మహా ప్రభూ." ఆడవాళ్లు వాళ్లల్లో వాళ్లు అనుకుంటున్నారు భక్తిగా.

అంత మంది మగవాళ్లున్నారని ముందుకు రావడనికి జంకి దూరంగా నిలబడి, అపురూపంగా చూస్తున్నారు.

ఒకతను ఏపిల్ పళ్లు రెండు తెచ్చి వినయంగా స్వామికి సమర్పించి చేతులు దులుపుకున్నాడు. ఏదో "ఉడుతా భక్తి..." అన్నట్టుగా.

మరొకతను, నిమ్మపళ్లు అర్జంటుగా తెప్పించి నిమ్మరసం గాజు గ్లాసుల్లో పోసి తీసుకొచ్చి మహా వినయంగా అందించి చేతులు కట్టుకు నిలబడ్డాడు.

నేను హడావిడిగా లోపల కాఫీని కప్పుల్లో సర్దుతున్నాను. ట్రే నీట్‌గా వుందా, లేదా చూస్తూ.

ఇంతలో మావారు లోపలికి వచ్చేరు. "కాఫీ చెయ్యడం అయిందా?" అని కాస్త గట్టిగానే అడుగుతూ.

"ఊఁ!" అన్నాను తల ఎత్తకుండానే. దగ్గరగా వచ్చి చెవిలో మెల్లగా ఒక విషయం చెప్పి వచ్చినంత వేగంగా వెళ్లిపోయేరు.

అతనింకా వెళ్లేలోగానే రెడ్డి కేక, "మూర్తిగారూ! లోపలేం చేస్తున్నారండీ? యిలారండీ!" అని!

ఆ "విషయం" విన్న నేను స్టన్నయిపోయేను!

నయం యింకా. నయమేమిటి? యిప్పుడెలాగ? అమ్మో! తల్చుకుంటే గుండె గుభేలు మంది. ఎంత మోసం? అయినా వాళ్లకి బుద్ధిలేక పోతేసరి. అసలు మావారు గాని వచ్చి చెప్పకపోతే నేనింకా ఎలాంటి పిచ్చి పన్లు చేసి వుండేదాన్నో మూఢ భక్తిలో పడి!? మిగతా వాళ్లకి అసలు సంగతి చెప్పేద్దామనిపించింది. కాని "ఎవరికీ చెప్పకు." అని అతనన్నారు.

"వాళ్లు యివాళ సున్నంలోకి ఎముకలు లేకుండా తన్నులు తినడం ఖాయం." అనుకున్నాను భయంగా.

ఇవతల కొచ్చేను.

రెడ్డిని చూసేసరికి నాకు నవ్వు వచ్చింది.

"ఏమిటి నవ్వుతారు? మీ తలనొప్పి గురించి చెప్పండి అతనికి." అన్నాడు దబాయిస్తున్నట్టు.

"నాకు విభూతుల మీద అంత నమ్మకం లేదండీ." అన్నాను నవ్వుతూ. నవ్వుతూనే మా వారి వైపు చూసేను. ఆయన నావైపు చూసి నవ్వు తున్నారు మెల్లిగా. యిదంతా రెడ్డి దృష్టిలో పడింది. గుర్రుగా చూసేడు అతని వైపు. "ఎందుకు చెప్పేరు?" అన్నట్టు.

అతను మరి నటించలేకపోయేడు.

బాబాజీ వైపు తిరిగి, రెండు చేతులతోనూ ఒక చప్పుడుతో నమస్కారం చేసి; "పదండి, బాబాజీ; నా రూంకి వెళ్ళి కొంచెం విశ్రాంతి తీసుకుందురుగాని-" అన్నాడు; (ఇంగ్లీషులోనే;) లేస్తూ.

మల్లిక్, పిళ్లై కూడా వాళ్లతో పాటే లేచారు.

నేను మా వారిని పిల్చేను కళ్లతోనే.

లోపలికి వచ్చేరు. మెల్లగా చీవాట్లు పెట్టేను, "ఇంటావిడకు తెలిస్తే మనల్ని యిల్లు ఖాళీ చేసే మంటుంది. ఏమిటీ వేషాలు? ఇదేం స్టేజను కున్నారా? నటించ డానికి! అంత సరదా అయితే మీరంతా కల్సి ఎక్కడయినా డ్రామా కంపెనీ పెట్టండి తిక్కలు కుదుర్తాయి." అన్నాను వళ్లు మండి.

"నేనేం చేస్తాను? మేమందరం బీచ్ దగ్గర కలిసేము. అసలు ఈ రెడ్డే చేసేడు అంతా. మీ ఆవిడ్ని అల్లరి పెడ్దాం. ఆవిడ రోజూ తలనొప్పి అంటూ వుంటారు కదా! ఏం చేస్తారో చూద్దాం. ఒరేయ్ సంపత్! నువ్వు రెడీయేనా! ఎలాగూ నువ్వు వేసిన లాల్చీ కాషాయ రంగులో వుంది. నిన్ను చూస్తే ఎవ్వడూ "తెలుగువాడు" అనుకోడు! సో. నువ్వు కూడా నవ్వకుండా, ఒక్క తెలుగు మాట కూడా మాట్లాడకుండా జాగ్రత్తగా నటిస్తానంటే పద. ఒ.కే." అంటూ. సరే అంటే సరే అనుకున్నాం. అంతేకాని యిక్కడి వాళ్లందరూ యింత అట్టహాసం చేస్తారనుకో లేదు." అన్నారు.

"ఎలాగూ మేడమీదకి వెళ్తున్నారు కదా. మల్లిక్‌కి, పిళ్లైకి అక్కడ చెప్పేయండి అసలు సంగతి. ఆలస్యమయితే అప్రదిష్ట!" అన్నాను.

అక్కడున్న ఆడవాళ్లతో ఏం చెప్పాలో మనసులో ఓసారి మననం చేసుకుని ఆ విధంగా కష్టపడి చెప్పేసేను. మగాళ్లంతా మేడ దిగి వచ్చేరు. మల్లిక్, పిళ్లైలకి బాగా కోపం వచ్చినట్టుంది. కాని మామీదున్న గౌరవం చేత పాపం మాట్లాడకుండా వూరుకున్నారు!

ఆ రోజు వాళ్లందరికీ డిన్నరు ఏర్పాట్లు మాయింట్లోనే.

ఇంత జరిగినా ఆ రోజు ఇంటావిడ దర్శనం కాకపోవటం ఆశ్చర్యం కలిగించింది. పాపం ఆవిడకి వంట్లో బాగు లేదట. కాని మర్నాడు యింటావిడ రెడ్డిని పిలిచింది.

"మీ వాలకం నాకేం నచ్చడం లేదు. మీరు వెంటనే ఇల్లుఖాళీ చేసెయ్యండి. వెంటనే వీలు కాదనుకుంటే యీ నెలాఖరికి ఖాళీ చెయ్యండి. అంతే!" అంటూ ఆమె చూసిన చూపు శివుడి మూడో కన్నుని జ్ఞప్తికి తెచ్చింది.

రెడ్డి నిర్లక్ష్యంగా వించున్నాడు. ఇంతలో -

"మమ్మీ!" లోపల్నుంచి కల్పన పిలుపు అది!

బరువైన శరీరాన్ని మోసుకుంటూ ఇంటావిడ లోపలికి నడిచింది.

ఆ అమ్మాయి ఏం చెప్పిందో, ఎలా గారాలు పోయిందో, ఏ అస్త్రం వుపయోగిం చిందో

తెలీదు. కాని యింటావిడ కొంత సేపటికి యివతలకి వచ్చింది ముఖానికి నవ్వు పులుముకుని; రెడ్డితో మళ్లీ మాట్లాడింది.

"సరేనయ్యా. మా అమ్మాయి చెప్పిందికూడా విన్నాను, మీరంతా ఒక ఈడు వాళ్లు; హుషారుగా ఉంటే అది మీకు పెద్ద తప్పుకాదు. కాని, మరీ పెంకితనం, అల్లరీ పనికిరావు యింక మీదట; చెప్తున్నాను!" అంటూ ఆప్యాయంగా రెడ్డి భుజం మీద చరిచింది.

రెడ్డి గర్వంగా నావైపు చూసేడు.

కోటలో పాగా వేసేడు. అందుకే అంత ధైర్యంగా అల్లరి చేస్తున్నాడు." అనుకున్నాను రెడ్డిని చూసి. అదీ విషయం.

★ ★ ★

*(కలువబాల, వీక్లీ ; 16-31 జూలై 1987)*